
న్యూ బాలాజీనగర్‌లో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

## డ్రైనేజీ ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు

**రాంనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ నియోజకవర్గంలో దశాబ్దాల నాటి డ్రైనేజీ వ్యవస్థను తొలగించి పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆధునికీకరణ చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని సీ బాలాజీనగర్ రూ.3 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్తీలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, న్యూ బాలాజీనగర్‌లో గత కొన్ని సంవత్సరాలుగా పురాతన డ్రైనేజీ లైన్‌వల్ల ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు నూతన పైప్‌లైన్ మంజూరు చేయడం జరిగిందని ఆయన వివరించారు. నిర్మాణ పనులలో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన నాయకులు ముఠాజైసింహ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె సురేందర్, న్యూ బాలాజీనగర్ అధ్యక్ష, కార్యదర్శులు మహేష్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, బీఆర్‌ఎస్ నేతలు మాదవ్, చిట్టి, ముచ్చకుర్తి ప్రభాకర్, సుధాకర్ గుప్తా, రవియాదవ్, బొట్టు శ్రీనివాస్, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

**● ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తొలగింపు**

రాంనగర్ నుంచి పార్శిగుట్ట వెళ్లే రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించాలని స్థానికుల ఫిర్యాదు మేరకు వాటిని తొలగించినట్లు ఆజామాబాద్ ఏడీఈ వినోద్ కుమార్ తెలిపారు. తుప్పుపట్టిన కరెంట్ స్తంభాలను తొలగించి సిమెంట్ స్థంభాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.


కాళోజి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రసన్న తదితరులు

## పీడితుల పక్షాన రచనలు చేసిన కాళోజి

**చిక్కడపల్లి, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి):** పీడితుల పక్షాన కాళోజి నారాయణరావు రచనలు చేశారని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. కవి కాళోజి నారాయణరావు వర్ధంతి సందర్భంగా చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను ఎలుగెత్తి తన రచనల్లో చాటిన గొప్ప వ్యక్తి కాళోజి అన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన వారిలో కాళోజి ప్రముఖులన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ గ్రేడ్-1 గ్రంథపాలకురాలు ప్రతిభారెడ్డి, సిబ్బంది సుకేష్, అవినాష్‌రావు, శ్రీకాంత్, పోటీపరీక్షల అభ్యర్థులు, లైబ్రరీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్కూల్ భవనం నిర్మించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నేతలు కె వినయ్‌కుమార్ తదితరులు

**కవాడిగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** పీడబ్ల్యూడీ క్వార్టర్స్ ఖాళీ స్థలంలో చింతలగూడ మోడల్ స్కూల్‌ను నిర్మించాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె వినయ్‌కుమార్, రాష్ట్ర కోశాధికారి బాపనపల్లి ప్రమోద్‌కుమార్, సంఘం ప్రతినిధులతో పాటు అంబేడ్కర్ యువసేన చింతలబస్తీ నాయకులు కాదారం హరిదర్, సాయికుమార్, జామ్ చక్రధర్, ఉదయ్‌కుమార్‌లు మాట్లాడారు. పీడబ్ల్యూడీ ఖాళీ స్థలంలో పాఠశాల భవనం నిర్మించడంతో పాటు పిల్లలకు మంచి విద్య స్పోర్ట్స్ అక్టివిటీస్ కోసం గ్రౌండ్ నిర్మాణం చేపట్టాలని కోరినట్లు వారు తెలిపారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రదీప్, స్వరూప తదితరులు

## కార్పొరేట్ ఆసుపత్రుల ఫీజు దోపిడీని అరికట్టాలి

**రాంనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల ఫీజు దోపిడీని అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కెఎస్ ప్రదీప్, పీఓడబ్ల్యూ అధ్యక్షురాలు డి స్వరూప హెచ్చరించారు. కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రుల ఫీజుల దోపిడీకి సంబంధించి ఈనెల 15వ తేది నుంచి ప్రజాప్రాయ సేకరణ కోసం ప్రజా సంఘాలు రూపొందించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం విద్యానగర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న కార్పొరేట్, ప్రైవేట్ ఆసుపత్రులు డయాగ్నస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీవైఎల్, పీఓడబ్ల్యూ నాయకులు రవికుమార్, బిఎస్ కృష్ణ, లక్ష్మీబాయి, వరలక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కె మురళీ కృష్ణ తదితరులు

## తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ కమిటీ ఎన్నిక

**రాంనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని బాగ్‌లింగంపల్లిలో జరిగిన సర్వసభ్య సమావేశంలో బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కనకం మురళి, ప్రధాన కార్యదర్శిగా తమ్ము అశోక్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడుగా టీఎస్ఆర్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శిగా గోట్ల సూర్యకళ, కోశాధికారిగా జయనాథ్ ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షుడిగా వేణుగోపాలస్వామి, ఎం.స్వర్ణకుమారి, కె.జయసేనారెడ్డి, కె లక్ష్మణ్‌రావు, సంయుక్త కార్యదర్శులుగా కటకం జానకి, ఝాన్సీ లక్ష్మీబాయి, జి యాదగిరి, డి పవన్‌కుమార్‌లతో పాటు మిగతా సభ్యులను ప్రకటించారు.


ట్రస్మా రాష్ట్ర నూతన కమిటీ అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, సభ్యులు

## ట్రస్మా రాష్ట్ర నూతన కమిటీ నియామకం

**ముషీరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారి శ్రీకాంత్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ట్రస్మా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌లు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బడ్జెట్ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌బి సుదర్శన్, రాష్ట్ర ట్రస్మా అధికార ప్రతినిధి రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ రోడ్డుకు మోక్షం ఎప్పుడో?

**● నిధులు మంజూరైనా ముందుకు రాని కాంట్రాక్టర్లు**
**● ప్రమాదాలకు గురవుతున్న ప్రజలు**


అధ్వానంగా మారిన షేర్‌అలీ వీధి రోడ్డు

**ముషీరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ డివిజన్ షేర్ అలీ వీధిలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎక్కడ చూసినా గుంతలు పడి, కంకర లేచి అస్తవ్యస్తంగా తయారయింది. దీంతో ఆ రోడ్లపై వెళ్లే వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం కోసం రెండుసార్లు నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. జీహెచ్‌ఎంసీ అధికారులు సైతం కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్ల ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తుండడంతో ఇబ్బంది పడుతున్నారు. షేర్ అలీ వీధి రోడ్డు నిర్మించాని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముషీరాబాద్ డివిజన్‌లోని షేర్ అలీ వీధిలో సుమారు 200ల కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ వీధులు చిన్నవిగా ఉండడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సంవత్సరం క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం కోసం రోడ్డు తవ్వడంతో గుంతలమయంగా మారింది. గుంతల రోడ్ల కారణంగా స్థానికులు అనసుజ అనే మహిళ, అవియాన్ అనే బాలుడు కిందపడడంతో చేతులు విరిగాయి.

**● ముందుకురాని కాంట్రాక్టర్లు**

షేర్ అలీ వీధిలో రోడ్డు నిర్మాణానికి రెండుసార్లు నిధులు మంజూరైనా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో ఉన్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఆయన బదిలీ కాగా ఆయన స్థానంలో వచ్చిన మరో కమిషనర్ ఆమ్రపాలి మంజూరైన నిధులను రద్దు చేశారు. షేర్ అలీ వీధిలో రోడ్లన్ని చిన్నగా ఉండడంతో కాంట్రాక్టర్లు సైతం పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు.

**బడ్జెట్ మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం**

రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందజేశాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. షేర్ అలీ వీధులు చిన్నవిగా ఉండడం వల్ల పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడం వల్లే జాప్యం జరుగుతోంది.

- మురళీ, జీహెచ్‌ఎంసీ ఏఈ

**ప్రమాదాలకు గురవుతున్నాం**



అస్తవ్యస్త రోడ్డు కారణంగా ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై నడవడానికి సైతం వీలులేని పరిస్థితి ఉంది. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలి.

- బల్లా ప్రశాంత్, స్థానికుడు

**అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం**



షేర్ అలీ వీధి రోడ్ల సమస్యపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. టెక్నికల్ సమస్యల వల్ల రోడ్డు పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదంటున్నారు. ఇటీవల జోనల్ కమిషనర్‌ను కలిసి నిధులు మంజూరు చేయాలని కోరాం.

- సుప్రియానవీన్‌గౌడ్, ముషీరాబాద్ కార్పొరేటర్

**జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు సూచించాం**



షేర్ అలీ వీధి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు వివరించాం. గతంలో నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. త్వరితగతిన రోడ్డు నిర్మిస్తాం.

- ముఠా గోపాల్, ఎమ్మెల్యే

## సర్టిఫికెట్ల కోసం దళారులను ఆశ్రయించొద్దు

**● ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్**



**కవాడిగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ముషీరాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయ పరిధిలో వివిధ సర్టిఫికెట్ల కోసం వచ్చేవారు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా దళారుల కదలికలు గమనిస్తున్నామని తహసీల్దార్ కె.రాణాప్రతాప్‌సింగ్ తెలిపారు. సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం జరిగితే లబ్ధిదారులు నేరుగా తమను కలవాలని సూచించారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు. నూతన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

**ముషీరాబాద్ మండల కార్యాలయ పరిధిలో సిబ్బంది కొరత ఉందా?**

కార్యాలయ పరిధిలో ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు, ఒక ఆర్ఐ, నలుగురు స్పెషల్ ఆర్ఐలు విధులు నిర్వహిస్తూ సకాలంలో సర్టిఫికెట్లు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి, ఒక సర్వేయర్‌ను నియమించాలని ఉన్నతాధికారులను కోరాం.

**ధృవీకరణ సర్టిఫికెట్ల జారీలో ఆలస్యంపై వస్తున్న ఆరోపనలు నిజమేనా?**

కుల సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి విచారణ చేసి 30 రోజుల్లో ఇస్తాం. ఆదాయ ధృవీకరణ పత్రంమాత్రం వారం రోజుల్లో ఇస్తాం. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి సర్టిఫికెట్ల అందజేయడం జరిగింది, లబ్ధిదారులు కూడా అప్పటికప్పుడు కాకుండా ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికి సకాలంలో సర్టిఫికెట్లు అందజేస్తాం. కొందరు చివరి సమయంలో దరఖాస్తు చేసి రెండు రోజుల్లో సర్టిఫికెట్ కావాలని అడుగుతున్నారు.

**కొంతమంది స్పెషల్ ఆర్ఐలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మీ దృష్టికి వచ్చిందా?**

కుల, నివాస, ఆదాయ, ఓబీసీ, లీగలైర్ సర్టిఫికెట్ల కోసం చేసుకున్న దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి ఎంక్వైరీ చేసి సకాలంలో సర్టిఫికెట్లు ఇస్తున్నాం. మీరు చెప్పినట్లు అలాంటి ఫిర్యాదులు రాలేదు. ఎవరైనా సర్టిఫికెట్ల జారీ కోసం డబ్బులు డిమాండ్ చేస్తే తనకు ఫిర్యాదు చేయండి.

**నూతన వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళలు. బీడి కార్మికుల పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారా?**

కార్యాలయ పరిధిలో ప్రతీరోజు నూతన పింఛన్ల మంజూరు కోసం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని అయితే వారి దరఖాస్తుల ఆధారంగా ఎంక్వైరీ చేసి నివేదిక రూపొందించి నూతన పింఛన్ల మంజూరు కోసం ఉన్నతాదికారులకు పంపిస్తున్నాం.

**లాల్‌బహదూర్ శాస్త్రీనగర్‌లో పూర్తయిన నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను రకు లబ్ధిదారులకు ఎందుకు కేటాయించలేదు?**

లాల్‌బహదూర్ శాస్త్రీనగర్‌లో 40 డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం పూర్తయింది, నగర ఇన్‌చార్జి మంత్రి, అధికారులు సమయం ఇస్తే త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తాం

**ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా తీసుకుంటున్న చర్యలు ఏమిటి?**

మండల కార్యాలయ పరిధిలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసినట్లు ఫిర్యాదులు రాలేదు. ఏమైనా సమాచారం ఉంటే స్థానిక ప్రజలు ఫిర్యాదు చేస్తే కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

## పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్యపై సదస్సు

**టీ-హబ్‌తో యూఈఎల్ ఒప్పందం**

**హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణలో పరిశ్రమ, విద్యారంగం స్పందించాల్సిన తీరుపై చర్చిస్తూ 'పర్యావరణ పరిరక్షణలో ఉన్నత విద్య : పరిశ్రమ, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యం' అంశంపై ఓ కార్యక్రమాన్ని రాయదుర్గంలోని టీ-హబ్ వద్ద బుధవారం నిర్వహించారు. యూనివర్సిటీ ఆఫ్ ఈస్ట్ లండన్ (యూఈఎల్), సిమెన్స్, టీ-హబ్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూఈఎల్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ క్యాంపస్) ప్రొఫెసర్ పౌల్ మార్షల్, డైరెక్టర్ గుల్నార్ స్టోవేర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ, విద్యారంగ భాగస్వామ్యాలను నిర్మించడంలో సవాళ్లు, అవకాశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయాలు హరిత ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో తమ పాఠ్యాంశాలను ఎలా సమలేఖనం చేయవచ్చనే అంశాలను చర్చించారు. దీనిలో భాగంగా సిమెన్స్‌తో యూఈఎల్ ఒప్పందం కూడా చేసుకుంది. భారతదేశపు ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని చెబుతూ 2030 నాటికి నికర సున్నా ఉద్గారాలను లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. సీమెన్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం వైస్ ప్రెసిడెంట్ ఫేయ్ బౌసర్ మాట్లాడుతూ ఉన్నత విద్యాసంస్థల భాగస్వామ్యంతో పర్యావరణ అనుకూలత గురించి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామన్నారు.

**నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు**

**చిక్కడపల్లి:** ఆజామాబాద్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. అంజయ్యక్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి బర్కత్‌పుర పెట్రోల్‌బంక్, బసంత్‌కాలనీ పరిధిలోని లింగంపల్లి, వైశ్యాహాస్టల్, వెంకటరమణ థియేటర్, జైన్‌మందిర్, కాచిగూడ క్రాస్‌రోడ్, చుట్టుప్రక్కల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ తెలిపారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం


మురళీధర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ముఠా జైసింహ

**ముషీరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తల కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని బీఆర్‌ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మురళీధర్ తల్లి అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న పార్టీ నాయకులతో కలిసి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సుధాకర్ గుప్తా, రవియాదవ్, నేత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కాలజ్ఞానం నేటి సమాజానికి ఎంతో అవసరం


పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామికి నివాళులర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

**కవాడిగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** పోతులూరి వీరబ్రహ్మం కాలజ్ఞానం నేటి సమాజానికి ఎంతో అవసరముందని హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్ తెలిపారు. ఈ తరం వారికి వీరబ్రహ్మంగారి బోధనలు, కాలజ్ఞానం అందుబాటులోకి తేవాలన్నారు. మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి బుధవారం ట్యాంక్ బండ్‌పై వీరబ్రహ్మం విగ్రహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. పోతులూరి జ్ఞానమార్గాన్ని చూపిస్తూ సమాజ సమతుల్యతను నిలబెట్టారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ మాట్లాడుతూ.. కులమత బేధాలకు అతీతంగా సర్వమానవ సమానత్వాన్ని చాటి చెప్పిన పోతులూరి సామాజిక విప్లవకారుడని తెలిపారు. వీరబ్రహ్మం జయంతి ఉత్సవాన్ని రాష్ట్రప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. అజ్ఞానపు చీకట్లను చీల్చి జ్ఞాన వెలుగులు ప్రసాదించిన తత్త్వవేత్త, దార్శనికుడు పోతులూరి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ కమిటీ కన్వీనర్ అట్లూరి రవీంద్రాచారి, ఓయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకటరామయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు రవీంద్రాచారి, అన్న భీమోజు జితేంద్ర, రాఘవేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కనులపండువగా తులసీ కల్యాణం

**చిక్కడపల్లి, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి):** చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని తులసి కల్యాణం కనులపండువగా బుధవారం నిర్వహించారు. ఆలయంలో సాగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ ఈవో దేవనాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయంలోనూ తులసిలగ్నం నిర్వహించారు.


బర్కత్‌పుర చౌరస్తా వద్ద పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

## వరద నీటి కాలువ పనులు ప్రారంభం

**బర్కత్‌పుర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** కాచిగూడ డివిజన్ బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి ప్రధాన రోడ్డు వద్ద 47 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులను అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం ప్రారంభించారు. స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమాదేవితో కలిసి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో వరద నీటి కాలువల నిర్మాణ పనులను చేపడుతున్నామని ఆయన చెప్పారు. వచ్చే వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు వర్షం నీరు సాఫీగా వెళ్లడానికి ఈ పైప్‌లైన్‌లు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మాదేవ్ పాల్గొన్నారు.

## పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం


రీసెర్చ్ స్కాలర్‌తో సంభాషిస్తున్న కేంద్రమంత్రి సుకాంత్, చిత్రంలో వీసీ బీజేరావు

**హెచ్‌సీయూను సందర్శించిన కేంద్రమంత్రి సుకాంత్ మజుందార్**

**హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** పరిశోధనల్లో విద్యావేత్తల కృషి అభినందనీయం అని కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత్ మజుందార్ అన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ఆయన బుధవారం సందర్శించారు. కేంద్రమంత్రికి వర్సిటీ వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ దేవేష్ నిగమ్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు, ఆచార్యులతో కేంద్రమంత్రి సంభాషిస్తూ.. దేశ భవిష్యత్ రూపకల్పనలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. పరిశోధ్ర్సిటీ విజన్‌కు అనుగుణంగా విద్య, నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై కూడా మంత్రి చర్చించారు. లైఫ్ సైన్సెస్ విభాగంలోని యాస్పైర్ బయోనెస్ట్(నాలెడ్జ్ బేస్డ్ ఇంక్యుబేటర్)ను సందర్శించిన మంత్రి అక్కడి స్టార్టప్‌ల అభివృద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా క్యాంపస్‌లో ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో పలు విభాగాల ఉన్నతాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్లపై కొనసాగుతున్న స్క్రాప్ దుకాణాల సీజ్

**భోలక్‌పూర్‌లో రోడ్డు ఆక్రమణలు తొలగించిన జీహెచ్‌ఎంసీ అధికారులు**


భోలక్‌పూర్ ఇందిరానగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల కూల్చివేతలను పరిశీలిస్తున్న డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్

**రాంనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** భోలక్‌పూర్ డివిజన్‌లోని ఇందిరానగర్ ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న నాలుగు స్క్రాప్ దుకాణాలను ముషీరాబాద్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఫుట్‌పాత్‌పై నిర్వహిస్తున్న మరికొన్ని స్క్రాప్ దుకాణాలను పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. బుధవారం ముషీరాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మహ్మద్ ఖదర్ మొయినుద్దీన్ పర్యవేక్షణలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్, సెక్షన్ ఆఫీసర్ కృష్ణయ్యలు ముషీరాబాద్ పోలీసు బందోబస్తుతో చేరుకొని ప్రజలకు ఇబ్బందికరంగా కొనసాగుతున్న నాలుగు స్క్రాప్ దుకాణాలను సీజ్ చేసి పలు ఫుట్ నిర్మాణాలు తొలగించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు, అధికారులకు మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది ఈ సందర్భంగా డీఎంసీ, ఏసీపీలు మాట్లాడుతూ, ఇందిరానగర్, సాయిబాబా గుడి సమీపంలో పలువురు స్క్రాప్ వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా రోడ్లపై షాపుల నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వాటిని తొలగించాలని స్థానికులు కోర్టుకు వెళ్లారని తెలిపారు దీంతో కోర్టు ఆదేశాల మేరకు స్క్రాప్ దుకాణాలను సీజ్ చేయడంతో పాటు పలు ఆక్రమణలు తొలగించారు. వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది అనిల్, శ్రీధర్ జగన్ రాజయ్య పాల్గొన్నారు.


షాపులను సీజ్ చేస్తున్న అధికారులు

## వీహెచ్ పోరాటంతోనే బతుకమ్మకుంట పునర్నిర్మాణం


స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

**రాంనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** మాజీ ఎంపీ వి హనుమంతరావు చేసిన పోరాటంతోనే బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంట పునర్నిర్మాణానికి హైడ్రా శ్రీకారం చుట్టిందని, ఈ ఘనత వీహెచ్‌కే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు పి జ్ఞానేశ్వర్‌గౌడ్, పుల్లా నారాయణస్వామి, దిడ్డి రాంబాబు పేర్కొన్నారు. బుధవారం బతుకమ్మకుంట స్థలాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులతో సందర్శించి 5.15 ఎకరాల స్థలంలో చెరువును పునర్నిర్మించే పనులు ప్రారంభించారు. దీనిని స్వాగతిస్తూ కాంగ్రెస్ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బతుకమ్మకుంట స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలతో కాజేయడానికి కుట్రలు పన్నారని తెలిపారు. అయితే ప్రభుత్వ స్థలాలు, చెరువులు, నాలాల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాతో బతుకమ్మకుంట స్థలం పరిరక్షణకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. పేదల ఇళ్లను కూల్చబోమని హైడ్రా కమిషనర్ ప్రకటించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు లక్‌పతి, యాదగిరిగౌడ్, రాంమోహన్‌రావు, రాజేశ్వర్‌రావు, గడ్డం శ్రీధర్‌గౌడ్, రాముల సుధాకర్, సందీప్‌గౌడ్, లక్ష్మణ్ రాథోడ్, విజితారెడ్డి, శాంతమ్మ, రాజ్‌కిరణ్, మహేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 'బతుకమ్మకుంట స్వాధీనం చట్ట విరుద్ధం'


మాట్లాడుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి

**రాంనగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):** బతుకమ్మకుంట స్థలం ప్రభుత్వానిది కాదని అందులో హైడ్రా చెరువు నిర్మాణ పనులు చేపట్టడం చట్ట విరుద్ధమని ఆ స్థల యజమానిగా చెప్పుకుంటున్న అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి ఎడ్ల సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చే నంబర్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మకుంట స్థలాన్ని తాము ఆ స్థల యజమానుల నుంచి గతంలో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ స్థలంపై కోర్టులో వివాదం కూడా కొనసాగుతుందని తెలిపారు. తనను పోలీసుల చేత అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయించి హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆ స్థలంలో చెరువు పునర్నిర్మాణ పనులు చేపట్టడం సబబు కాదన్నారు. వీహెచ్ ఒత్తిడి మేరకు హైడ్రా కమిషనర్ తమ స్థలంలోకి వచ్చారని సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు హైడ్రా అధికారుల చర్యలపై న్యాయపోరాటం చేసేందుకు కోర్టుకు వెళతానని ఎడ్ల సుధాకర్‌రెడ్డి చెప్పారు. హైడ్రా అధికారుల చర్యలపై అంబర్‌పేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సుధాకర్‌రెడ్డి తెలిపారు.